# చక్రధారి

ఇంకా ఆరవలేదు, టైం. రోజూ ఎంత రాత్రయితే అంత సంతోషించే డ్రైవర్ బైరాగి (వాడికి ఓవర్ టైమ్ బైరాగి అని నిక్ నేమ్) ఇవాళ ఎందుకో. ఒకటికి రెండుసార్లు కిటికీ తలుపు మీదుగా మొహం చూపించడం వరండాలో నుంచుని దగ్గడం చేస్తున్నాడు. వాడికివాళ తొందరగా ఇంటికెళ్ళిపోవాలనుందని తెలిసిపోయి వాణ్ణి కొంతసేపు ఆపాలనే చిలిపి కోంక కలిగింది నాకు.

బెల్ నొక్కాను.

నేననుకున్నట్టుగానే బైరాగి ఠకీమని తలుపు తోసుకుని ప్రత్యక్షమయ్యాడు.

"నువ్వొచ్చావేమిటి? కాశయ్య ఏడీ?" అన్నాను.

"లెట్రిన్ కెళ్లేడండి. అడొచ్చేవరకు తమర్ని కనిపెట్టుకుని ఉండమన్నాడండి."

"సర్లే. వాడొస్తే రమ్మను."

బైరాగి బైటకెళిపోయాడు. వాడి మీద ఎవరో పెట్టిన ఆకాశరామన్న అర్జీ నా టేబిల్ మీద విడిగావుంది. ఇంతకు ముందొకసారి చదివిందే, మళ్ళా చదివాను, ఏం తోచనివాడిలాగ. మా మేనేజింగ్ డైరెక్టర్‌గారి పేరిట వచ్చింది ఆ అర్జీ.

"అయ్యా. తమ చీఫ్ ఇంజినీర్‌గారి జీపు నడిపే బైరాగిగార్ని గురించి తమరెన్నడైనా పట్టించుకున్నారా? మీకు తెలియకపోతే మీ ఛీఫ్ ఇంజినీర్‌గార్నే అడిగి తెలుసుకోండి. అతను మీ కంపెనీలో డ్రైవర్‌గా ఇరవై యేళ్ళనాడు చేరేడు. ఆ నాటికి అతనికి తిన్డానికి తిండిలేదు, కట్టడానికి గుడ్డలేదు. మరి ఇవాళ? టౌన్‌లో ఒకయిల్లూ మల్కాపురంలో ఒక యిల్లూ ఉన్నాయి. ఈ రెండూ ఉండగా అతనికి మీరు క్వార్టర్స్ ఇచ్చారు. మల్కాపురంలో లేకపోయినా టౌన్‌లో ఇంట్లో అతని రెండోపెళ్ళాం ఉందన్న సంగతి మీకూ మీ ఛీఫ్ ఇంజినీర్‌గారికీ తెలియకపోయినా శ్రీబైరాగి సహోధ్యాయులకి మిగిలిన అనేక వృత్తుల వాళ్ళకీ తెలుసు. అతనికి రెండు ఇళ్ళు కట్టుకోడానికీ రెండో భార్యని మెయింటేన్ చేయడానికీ అవకాశం ఎలా వచ్చిందని మీ ఊహ? ఒకమాట బైరాగిగారి పర్సనల్ కేసు చిత్తగించండి. ఈ ఇరవై ఏళ్ళ సర్వీసులో మొదటి మూడేళ్ళు ఏమోగానీ, మిగిలిన పదిహేడేళ్ళలో ఏ ఒక్క నెలా అతగాడు ఓవర్‌టైమ్ చెయ్యకుండా గడపలేదు. ఓవర్‌టైం చెల్లింపుతో ఇళ్ళు కట్టొచ్చంటే మన కంపెనీలో చాలా మందే కడుదురు. కాని అతగాడు మీ ఛీఫ్ ఇంజినీర్‌గార్ని ఉదయం టౌన్‌లోంచి తీసుకొచ్చేటందుకు ఖాళీజీపు పట్టుకెళతాడు. అలాగే రాత్రి వార్ని ఇంటిదగ్గిర దించేసి ఖాళీ జీప్ తెచ్చి గరాజ్‌లో పెడతాడు. ఈ రెండు ఖాళీ ట్రిప్పుల్లో మీ ఛీఫ్ ఇంజినీర్‌గారి జీపు టౌనుకీ కంపెనీకీ మధ్య ఉన్న పదిహేను కిలోమీటర్ల దూరం టాక్సీగా నడుస్తూ ఉండవచ్చునన్న సంగతి తమకెన్నడైనా తట్టిందా? అలాగే, మన కంపెనీలాంటి కంపెనీలు వాళ్ల జీపులన్నిట్నీ డీజిలుకి మార్చడమో లేక పెట్రోల్ జీపులు కండెమ్ చేసి డీజిల్ జీపులు కొనడమో చేస్తూవుంటే ఈ ఒక్క పెట్రోలు జీపూ ఎలా మిగిలిపోయిందో తమరెన్నడైనా ఆలోచించారా? దానికి కారణం ఏమిటో ఊహించారా? డీజిల్ జీపులో డీజిల్ ఆయిల్ మిగిల్చి అమ్మడం కంటె పెట్రోల్ జీపులో

టి.ఎస్. శేషాద్రి




పెట్రోల్ మిగిల్చి అమ్మడం సుళువన్న సంగతి మీకు తెలుసా, అసలు?" మేనే జింగ్ డైరెక్టర్‌గారు ఆ కాగితాన్ని నాకు స్పెషల్ కవర్లో పెట్టి పంపిస్తూ "దీనిమీద విచారణ అవసరంలావుంది" అని పాము చావకుండా కర్ర విరక్కుండా రాసేరు. కిందనుంచి మీదికీ మీదినుంచి కిందికీ చద వడం అయింది.......

ఇంటర్ కమ్ అరిచి గీ పెట్టింది.

"యస్ –?" అన్నాను విసుగ్గా, కాగితం బ్రీఫ్‌కేసులో పెడుతూ.

"సార్, నేను ఫోర్మన్ అప్పల్రాజుని మాట్లాడుతున్నానండి. సారీసార్; ఇవాళ మా యూనిట్ షిఫ్ట్ ఇంజినీర్ భద్రాచలం గారు రాలేదండి, సార్ అందుకని నేనే తమర్తో మాట్లాడేస్తున్నాను సార్!"

"అసలేమిటి, చెప్పవయ్యా!" అని అరిచాను.

"ఆదేసార్, మనవి చేస్తాను. ఇప్పుడి ప్పుడే మెరైన్ యూనిట్ వాళ్ళు వార్నింగ్ చెప్పేరుసార్, ఏ నిమిషంలో అయినా పెద్ద గాలి వాన రావొచ్చుటసార్. ఇంతాంత గాలి వాన కాదంటసార్. సార్, డాక్ ముంపుడయి పోయేంత టైడ్ (కెరటాలు) రావచ్చంట సార్. తమరికి మనవిజేస్తున్నాను సార్.

"ఐసీ! స్లిప్ వేలో ఏమైనా పని జరుగు

తోందా ?"

"నెంబర్ ఫోర్‌లో ఛెస్టింగ్ అవుతోంది సార్."

"సరే, వెంటనే అన్ని జాగ్రత్తలూ తీసుకోండి, వర్కర్స్ ఎవరూ డాక్ విడిచి వెళ్ళకండి. నేనింటికెళ్ళిపోతున్నాను. ఓసారి ఫైర్ ఆఫీసర్‌కి ఫోన్ -"

టకీమని కనెక్షన్ పోయింది. ఏ సీ ఆగిపోయింది. రూమ్‌లో చీకటి అలముకొంది

సీట్లోంచి లేచి తలుపు తీసుకుని వరండాలో కొచ్చాను. కాశయ్యా, బైరాగీ కలిసి ఇటొస్తున్నారు.

చల్లటిగాలి సన్నంగా వీస్తూ అహ్లాదమే కలిగిస్తోందిగాని గాలివానకి సూచనగాలేదు. అయినా ఆ కాస్త గాలికే కరెంటు పోయిందంటే ఇంకెక్కడో అది తీవ్రంగా ఉందని, దాని ప్రభావం ఉన్నట్టుండి మన మీద పడొచ్చనీ నా చదువు నాకు ఎప్పుడో చెప్పింది.

"కాశయ్యా! లైట్లు పోయాయి కదా అని నీ అంతట నువ్వు తాళాలేసుకెళిపోవడంకాదు. స్విచ్చిలన్నీ ఆఫ్ చేసి మరీ వెళ్ళాలెల్సిందా?" అన్నాను.

"అలాగేసార్." అని కాశయ్య గదిలోకెళ్ళాడు.

"ఏం బైరాగీ, యేం చేద్దాం? ఇంటికెళ్ళిపోదామా ?"

"తమరిష్టంసార్"

"ఇవాళకి నీకు గంటన్నరే ఓవర్‌టైమ్ ప్రాప్తంలా ఉంది పోదాంపద. కాశయ్యని నా బ్రీఫ్‌కేస్ తెమ్మను" అని జీప్‌లో కూర్చున్నాను.

నా రూమ్‌నుంచి సెక్యూరిటీ గేటుకి ఒక కిలోమీటర్ ఉంటుంది. చిత్రంగా, ఆ కిలోమీటర్ దూరం వెళ్ళేలోగానే జీప్ అటూ ఇటూ వూగిపోయేటంత, జీప్ కేన్వాసులు పెద్ద హోరు పెట్టేటంత, గాలిరేగింది. ఇంత సేపూ కొండ చాటున ఉండడం వల్ల హోరూ జోరూ తెలియలేదు.

"బెస్టాఫ్‌లక్, సి. ఇ. సాబ్!" అన్నాడు ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కృష్ణమూర్తి వ్యంగ్యంగా నవ్వుతూ." గాలి పడమటికి వెళ్తోంది. శాతవాహన జంక్షన్ దగ్గిర గేర్ మార్చుకో బైరాగీ!" అన్నాడు, అదే వెటకారంతో.

అతనన్నట్టే, గేటు దాటిన పదిసెకండ్లలో వాల్‌చంద్ హీరచంద్ గారి విగ్రహం దగ్గిరకొచ్చేశాం. అయితే, అక్కడ టర్నింగ్ తిరిగేటప్పటికి కుడివేపునుంచి గోళీకాయలంతేసి చినుకులు ప్రారంభమై, బైరాగి నావేపు జరిగి కేన్వాస్ దించేడు. దించేడేగాని బటన్స్ పెట్టడానికి అవకాశం యివ్వలేదు గాలి.

"స్టాఫ్ చేసి బటన్స్ పెట్టు బైరాగీ." అన్నాను.

"స్టాప్‌చేస్తే ఓనిమిషం పడద్దిసార్! ఈ లోపులో ఒక కిలోమీటరెళ్ళిపోవచ్చు. వాన పెద్దదయిపోతంది. బేగా ఎల్లిపోడం మంచిదిసార్. అదీగాక, స్టాప్‌చేస్తే ఈ గాలి దెబ్బకి జీపు లేచిపోయి మీకేసి వొరిగిపోయి పడిపోవొచ్చుగూడాన్సార్!" అంటూ, ఎడం చేత్తో స్టీరింగ్ పట్టుకుని కుడిచేత్తో బటన్స్ పెట్టేడు; నేవల్‌బేస్ చివరి కొచ్చేలోపుగా.

శాతవాహన జంక్షన్ దగ్గిర కొచ్చేసరికి వైపర్లు ఎంత స్పీడుగా తిరిగినా దారి కనపడనంత వాన.


ఇలా నేవీ డ్రైడాక్‌లోంచి పోనీ, మనకి పాస్ ఉందికదా." అన్నాను.

"ఒద్దుసార్. రెగ్యులర్ రూట్లోనేపోదాం"

"అదికాదయ్యా ఆ హెచ్. పి. సి. నార్త్ గేటు దగ్గిర రోడ్డంతా మునిగి అంచనా తెలీక మనం ఏదోగోతులో పడిపోతాం. నేవీ వాళ్ళ రోడ్లు బావుంటాయి కదా"

"మీకు తెలీద్సార్" అని బస్సురూట్లోనే జీప్ పోనిచ్చాడు, బైరాగి.

* * *




నేవీడ్రైడాక్‌కి చెందిన కాకతీయ గేటు, చోళ గేటు, విజయనగర్ గేటు మూడూ చక్రానికి సగం ఎత్తున పారుతున్న నీటి గుండానే దాటి వెళ్ళాం. పేర్లల్ బ్రిడ్జి దగ్గిర మాత్రం రోడ్డంటూ కనబడింది. అది దాటి జీప్ తూర్పుకి టర్నింగ్ తిరిగింది.

ఎదర అంతా మహా సముద్రంలా ఓ పెద్ద షీట్ - ఆఫ్ - వాటర్. రోడ్డుకి రెండు వేపులా అరవయ్యేసి అడుగులు ఇటూ ఆటూ పోసిన రిక్లమేషన్ గట్లు తప్ప మరేమీ కనబడ్డంలేదు. ఇంకా ఎడతెగని వాన.

"బైరాగీ బండి ఆపు" అన్నాను.

"ఆపితే అంతే సంగతులు సార్. మిమ్మల్ని ఎలాగో ఇంటికాడ దింపే పూచీ నాదండి. మీరలా కూర్చోండి."

"అదికాదు. ఈ ఒక్కసారికీ నామాట విను. పోనీ బండి ఆపొద్దు. రివర్స్‌చేసి ఈ నాలుగడుగులూపోనిచ్చి జంక్షన్‌కి తీసుకెళ్ళు. అక్కణ్ణించి నేవీవాళ్ళ ఎన్.ఏ.డీ. రోడ్డు పట్టించు. అది ఎలాలేదన్నా ఇంతకంటె కొద్దిగా కళ్ళకి ఆనుతోంది." అన్నాను.

"అలాగైతేమాత్రం గోడవున్లుకీ, పీనుగులు గేటుకీ మయంలో నీళ్ళుండవనుకుంటున్నారేటి? మీకేటీ తెల్దుసార్. అలాకూర్చోండి!" బైరాగి స్వరమే మారిపోయింది.

నాకేమీ తెలీదనేసేడు బైరాగి. నాకు తెలిసిందేదో నాకూ తెలుసు. పోర్టువారి ఫ్లయోవర్ బ్రిడ్జికి పడమట ఉన్న డిప్ బాగా లోతు అన్నసంగతి బైరాగికేంతెలుసు? రోడ్డుకి ఇటూ అటూ పాతిన నలుపలకల ఇండికేటర్ రాళ్ళ అంచనాతో జీపు నడుపుతున్న బైరాగి మొహం ఒక్కసారిగా వికృతంగా మారిపోయింది, మరోనిమిషం సాగేసరికి -

అక్కడ -

ఇంకోయాభై అడుగుల్లో ఫ్లయోవర్ బ్రిడ్జి —

ఆ డౌన్‌లో - ఆ డిప్‌లో —

జీపులోకి గప్‌మని నీళ్ళు వచ్చేయడం, బైరాగీ నేనూ జీపులో ఉండే, నడుముల్దాకా నీళ్ళలో మునిగిపోడం, జీపు ఇంజిన్ నిస్సహాయంగా చిన్న గీరుపెట్టి మూగదయిపోడం క్షణంలో సగంసేపులో జరిగిపోయాయి.

• • •

ఒక్క నిమిషంలోనే సర్దుకున్న బైరాగి, శవంచెవిలో రామనామం చెప్పినట్టు ఇగ్నిషన్ 'కీ' తిప్పేడు.

శవం చలించలేదు.

"నే చెప్తే విన్నావుకాదు. అలా గోడౌన్స్ వేపు పోయుంటే ఇంతఅనర్థం జరిగేదికాదు". అన్నాను. అతని నిస్సహాయతలో పాలు పంచుకుంటూ వీలైనంత అనునయంగానే అన్నాను. కాని అతనికి అది అధికారి దెప్పుడు మాటలాగ వినిపించింది కాబోలు.

"లేచి అటు కేసి దిగండి" అన్నాడు పొడిగా.

"దిగితే ?"

"దిగండంతే." స్వరంలో ఆందోళన పోయి అధికారం ప్రవేశించింది.

"దిగితే ఇక్కడ రోడ్డుంటుందో గొయ్యుందో ?"

బైరాగి గొంతు మరింత కఠినంగా అయిపోయింది. "సార్! బండి నడిపేది నేను. నేను ఎక్కండన్నప్పుడు ఎక్కాల, దిగండన్నప్పుడు దిగాల. ఇట్నుండి నీళ్ళొచ్చేత్తన్నాయి. దిగండసలు!"

నేను దిగాను. అదృష్టవశాత్తు కిందని రోడ్డే ఉంది. చాలా ఆశ్చర్యకరమైన సంగతేమిటంటే అక్కడ నీళ్ళు తొడలోతే ఉన్నాయి. డిస్ప్లేస్‌మెంట్ ఆఫ్ వాటరు, రిజల్టెంటు లెవెలు వీటికి సంబంధించిన హైడ్రాలిక్స్ ప్రిన్సిపుల్స్ ఏవేవో గుర్తుకొస్తున్నాయి.

"రండి" అని అరుపుతో ఈ లోకంలో కొచ్చేను. బైరాగి ఒకచేత్తో నా బ్రీఫ్‌కేసు పట్టుకుని రెండో చేత్తో నా చెయ్యి అందుకున్నాడు.

"అదికాదు బైరాగీ. ఇంకా డిప్పు మొదలే ఇది. ముందుకెళ్తే ఇంకా లోతుకెళ్ళిపోతాం." అన్నాను అతని లాగుడుని ప్రతిఘటిస్తూ.

"ఊఁ —" అని గర్జించాడు బైరాగి. బ్రీఫ్‌కేసు అతను అందిస్తే నా కుడిచెయ్యి ఎలా అందుకుందో; అతను నన్ను రెండు చేతుల్తోనూ ఎత్తి మోసుకుపోతూవుంటే నేనెలా ఊరుకున్నానో నాకేం తెలీదు. ప్రవాహంలో అతను కొట్టుకుపోకుండా నేను పడిపోకుండా అడుగడుగూ నిలదొక్కుకుని ఆ యాభై అడుగులకి పదినిమిషాలు తీసుకున్నాడు.

ఫ్లయోవర్ బ్రిడ్జి ఎగుబోటులో నేల కనిపించగానే నన్ను అతి జాగ్రత్తగా ఒక టీవీ సెట్టుని దింపినట్టు దింపేడు బైరాగి. "ఇంక నడండి. మిమ్మల్ని మీ యింటికి జాగర్తగా చేర్చకపోతే ఈ బైరాగి ఒక అమ్మకీ ఒక అబ్బకి పుట్టనట్టే!"

"వీడికసి తగలడా!" అనుకున్నాను.

* * *

పోర్టువారి ఆర్. అండ్ డి. యార్డు దగ్గిర రైల్వే గేటు పడింది. వర్షానికి ముందే పడిందో వర్షం ఆరంభం అయ్యేక పడిందో తెలీదుగానీ అల్యూమినియం కార్పొరేషన్‌వాళ్ళ రైల్వే సైడింగుదాకా ఒకటే వరసని లారీలు, బస్సులు, కార్లు, జీపులు. గేటుకి దగ్గిరిగా ఓ యాభై స్కూటర్లు ఓ డజను ఆటోలు. ఇక్కడ గేటు పడింది గనకనే మాకు ఏ వాహనం ఎదురు రాలేదు.


అలా, గేటుదాకా నడిపించుకొచ్చి; ఒక్కసారి వెనక్కి తిరిగి చూసి, ఓలారీ దగ్గిరికెళ్ళాడు నన్ను వదిలేసి బైరాగి.

"ఏంగురూ! కులాసా?" అని ఆ డ్రైవర్ని పలకరించేడు.

"ఏం కులాసో దీనమ్మ — వర్షం!... నడిసొస్తున్నా వేటి ?"

వేదాంతిలా నవ్వేడు బైరాగి. "ఫ్లయోవర్ అవతల డవున్లో జీపు వచ్చింది." అన్నాడు "సార్, ఇట్రండి" అని పిల్చి "ఏటి, ఒచ్చేశారా ?" అని నా బ్రీఫ్‌కేస్ అందుకుని ఆ డ్రైవర్‌కిచ్చేశాడు. "అటుకేసి ఎల్లి ఎక్కండి సార్. మనోడేలెండి. ఇంటికాడ దింపేస్తాడు"

"అదికాదు, ఏదైనా ఆటోయెక్కి -" అని (అక్కడ ఇంకేమీలేవు గనుక) నీళ్ళ




నవిలాను.

"సార్! ఆటో చక్రం ఎంతుంటాది? మళ్ళీ సావుల మదుంకిందనో, పోనీ ఇటె త్తే కొబ్బరి తోట దగ్గిరో నీళ్ళల్లో కూరుకుపోతావి. నేను మీకూడా ఉంటప్పుడు లారీ ఏటి, టేంకరేటి! ఎక్కాండెక్కాండి, గేటు ఓపెన్ జేసెస్తన్నారు."

* * *

నా కోసం బెంగట్టుకుంటున్న మొహంతో పోర్టికోలో చిరుజల్లుకి తడుస్తూనే నిలబడి వుండిపోయిన మా 'అమ్మి' "అయ్యో అయ్యో!" అని నోటిమీదా నెత్తిమీదా కొట్టుకుంటూ గేటుతీసి, "లారీలో వొచ్చేరా, మీ తెగింపు బంగారంకానూ!- అమ్మో ఎంతలా తడిసిపోయేరో రండి, రండి;" అని బ్రీఫ్ కేస్ అందుకోవాలో నాకు చెయ్యందించాలో తెలీక గాన్ గాభరాలో పడిపోయింది.

అలవాటు ప్రకారం తనూదిగి, నాతో బాటు పోర్టికోదాకా వొచ్చి "ఎల్తానుసార్" అన్నాడు బైరాగి, చేతులు కట్టుకుని.

నేను బోర విరుచుకుని, "చూడు, అమ్మి మన బైరాగి దయవల్ల నేనిలా రాగలిగేను" అన్నాను. "ఇంతకి-" అని, బైరాగికి మహా కళాత్మకంగా కృతజ్ఞతలు చెప్పే ఉద్దేశంతో, మా ఆవిడ పైటలోంచి మాంగల్యం ఇవతలికిలాగి, "ఇది చాలా గట్టిది. కదూ, బైరాగి?" అన్నాను నవ్వుతూ.

బైరాగి కళ్లు మూసుకుని "పార్వతీ పర్మేశ్వర్లు" అని ఇద్దరికీ ఒక నమస్కారం పెట్టేడు. "ఎల్తానుసార్. అక్కడ మన జీపు ఏమైపోయిందో చూడాల."

"నీ మొహం ఈడ్చా, మళ్ళీ అక్కడికి పోతానంటావేమిటి? వెధవజీపు, డొక్కు జీపాని! పోతేపోనీ, కొత్తది కొనిపించేస్తాను మూడ్రోజుల్లో. కావాలంటే నీకి రాత్రంతా ఓవర్ టైమ్ రాస్తానుగానీ, ఈ వానలో మళ్లీ అక్కడికి తగలడి చావకు. మన్లోమనమాట, అక్కడ టౌన్లో కూడా ఓ ఇల్లుందిట కదా,

ఈరాత్రికి అక్కడ అఘోరించు." అన్నాను.

"మీకేం తెల్దుసార్. ఇప్పుడు మీరన్నారే, అమ్మగారి తాళిబొట్టు గట్టిదని - అలాటిది నాది టౌన్లో లేద్సార్, కోర్టర్స్ వుంది!" అని అల్లరిగా నవ్వుతూ మరి వెనక్కి తిరిగి చూడకుండా వెళిపోయాడు బైరాగి.

* * *

ఉదయం ఆరుగంటలవకుండానే ఫోన్- రెండుసార్లు తియ్యడానికి బద్ధకించేను. అవతలివాడెవడో రెండుసార్లూ తను, రాంగ్ నెంబర్లు తిప్పేనని అనుమానించిన వాడిలాగా మూడోసారి వదలకుండా పట్టుకున్నాడు.

"సార్, ఛీఫ్ ఇంజినీర్‌గారేనండి? నమస్కారంసార్. నేను ట్రాఫిక్ పోలీస్ ఇనస్పెక్టర్ రమణారావుని మాట్లాడ్తాన్ సార్"

"చెప్పండి."

"షిప్‌యార్డ్ రూట్‌లో పోర్ట్‌ఫ్లయోవర్ దిగువన తమరి జీపు నీళ్ళలో కొట్టుకెళ్ళి సైడ్ డిచ్‌లో వుందండి."

"ఐతే?"


"జీపుకి కొద్ది దూరంలో మీ డ్రైవర్ సచ్చిపోయున్నాడండి. మీ కంపెనీకి ఫోన్ చేస్తే సెక్యూరిటీ ఆఫీసర్ కిష్టమూర్తిగారు రాత్రి ఆజీపులో తమరు కూడా వెళ్ళారని, మీ ఇంటికి ముందుగా ఫోన్ చెయ్యమన్నారుసార్. తమరు ఆల్‌రైట్,సార్?"


"థాంక్యూ, అండ్ ఐమ్ వెరీసారీ ఫర్ బైరాగి. నన్ను ఇంటి దగ్గిర ఓ లారీలో దింపేసి. వెళ్ళొద్దురా అని చెబుతూ వుండే కూడా వెళ్ళేడు"

"సార్, తమరొక్కసారి డ్రైవ్ చేసి స్పాట్‌కి రావాల్సార్. జస్ట్, ఫార్మాలిటీ. అంతేసార్. నేనో ఐదునిమిషాల్లో జీప్‌తో తమరింటికి వస్తున్నాన్సార్."

* * *

లోకంలో ఎంత కుళ్లు! వెధవలు. ఇరవయి ఏళ్ళబట్టి బైరాగి ఆ జీపునీ, నన్నూ నడుపుతున్నాడు. వాడు ఓవర్‌టైమ్ చేసేట్ట, అదోపితూరీ! చేస్తే చేసేడు. వాడికి తాపత్రయం వుందిగాబట్టి, ఒంట్లో వోపిక వుంది గాబట్టీ చేసేడు. వాడు జీపుని టాక్సీలాగా తిప్పేట్ట; పెట్రోలు అమ్ముకున్నాట్ట; వాడు రెండు ఇళ్లు కట్టేడట; అందులో ఓదాంట్లో వాడికొాక ముండ వుందిట! ఓర్వలేని వెధవ ఎవడో ఆకాశరామన్న అర్జీ రాసేడు; వాణ్ణి తగలెయ్య.





వాడు చిన్న చిన్న కక్కుర్తులు పడి దమ్మిడీ దమ్మిడీ పోగుచేసి కూడబెట్టుకుని కూడు పెట్టుకుంటే ఆ కూట్లో దుమ్ము పోద్దామని ఆకాశంనించి దిగి వాస్తారు రామన్నలు. వాడికున్న స్వామిభక్తి-నామీదనేకాదు-కంపెనీలో ఎందరో ఆఫీసర్లు వాణ్ణి గురించి మంచిగా చెప్పుకోడం విని ఈ ఆకాశరామన్న గాడి చెవులు బిరుసెక్కాయి.

వాడు నిన్న సాయంకాలం నాపట్ల చూపించిన శ్రద్ధ, వాడి ప్రాణమైనా లెక్కపెట్టుకోకుండా నన్ను చేతులమీదుగా మోసి ఆ ఫ్లయోవర్‌దాకా తెచ్చి నన్నింటికి చేర్చిన త్యాగబుద్ధి ఈ ఆకాశరామన్నకి కోస్తే వుంటుందా? వెధవలు, డర్టీ ఫెలోస్!

"ఈ జీపులో తమరు నిన్న సాయంకాలం ఇక్కడిదాక వచ్చేరుసార్?" అని ఇనస్పెక్టర్ రమణారావు ప్రారంభించేదాకా అలా ఆలోచిస్తూనే ఉన్నాను. అన్నీ వివరంగా చెప్పేను.

జీపు నిటారుగా నిలబడేవుంది. టాప్‌కీ ఇనప చువ్వకీ మధ్య ప్లాస్టిక్ కవర్‌లో లాగ్ బుక్ చెక్కుచెదరకుండా వుంది. జీపు కంపెనీలో బయల్దేరిన టైమ్ నోట్‌చేశాడా అన్న పాయింటుకోసం లాగ్ బుక్ తెరిచాడు ఇనస్పెక్టర్.

నిన్నటి తేదీతో; మధ్యాహ్నం పన్నెండు గంటల టైమ్ వేసి చేసిన రిమార్కు అతని దృష్టిని ఆకర్షించింది :—

"స్టెప్నీ బోల్టులు పాతబడి పోయినందున నట్లు బిగవక; స్టెప్నీని జీపు వెనకభాగంలో టూజ్‌గా పడెయ్యవలసి వస్తున్నది. జీపు వెనక తలుపు గడియ సరిగా పడక అప్పడప్పుడు దానంతట అదే తెరుచుకుంట్నూ ఉన్నందుననూ, అందువల్ల బండి నడుస్తున్నప్పుడు స్టెప్నీ జారిపోయి రోడ్డుమీద పడిపోయే అవకాశం ఉన్నందువల్లనూ, ఈ డిఫెక్టు సరిజేసి తలుపు గడియ అమర్చడానికి వర్క్‌షాపుకి వెళ్ళడమైంది. కాని తలుపు వెల్డింగ్ చేయవలసిందేతప్ప గడియ అమర్చడానికి వీల్లేదనిన్నీ వెల్డింగ్ గ్యాస్ స్టాకు లేనందున రేపు రావలసిందనీ వర్క్‌షాపువాళ్ళు చెప్పారు." దానికింద వర్క్‌షాప్ ఫోర్మన్ సంతకం.

జీపు వెనకభాగంలో స్టెప్నీ టైరు లేదు.

జీపు వెనక తలుపు బారుగా తెరిచి వుంది.

"చూద్దాం" అని, ఇన్‌స్పెక్టరు, సైడు కాలవలో ఉన్న బైరాగి శవం వేపు నడిచాడు.

బైరాగి నీళ్ళలో బోర్లాపడి అలాగే చచ్చిపోయాడు.

అతని రెండూ చేతులూ స్టెప్నీ టైర్‌ని పట్టుకుని ఉన్నాయి.

"అంతే, సార్; మీ వాడు - ఐయామ్ సారీ - ఈలాగ్‌బుక్‌లో రికార్డయిన డిఫెక్ట్ ఆధారంగా ఆ స్టెప్నీ టైర్ రాలిపోయిందని సాకుపెట్టి దొంగతనంగా తీసికెళ్ళి ఎక్కడో అమ్మేద్దామని ప్రయత్నం చెయ్యడానికే రాత్రి మళ్ళా జీప్ దగ్గిరకి వచ్చేడని తేలిపోతూంది సార్. తమరేమీ అనుకోకుండా ఓ సారి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కొచ్చి స్టేట్‌మెంటియ్యాలిసార్" అన్నాడు ఇన్‌స్పెక్టర్ రమణారావు.

అమానుషం...